
# వాదనలన్నీ వినిపించి.. నోటీసు ఇవ్వలేదంటారా?

హైదరాబాద్



కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. మాజీ సీఎం కేసీఆర్‌కు పూర్తిస్థాయి అవకాశం ఇచ్చి వాదనలు విన్నదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. విచారణకు హాజరై, పూర్తి స్థాయి వాదనలు వినిపించి.. ఇప్పుడు కమిషన్ తనకు నోటీసు ఇవ్వలేదని కేసీఆర్ అనడం సమంజసం కాదని పేర్కొంది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8–బీ, సెక్షన్ 8–సీ కింద నోటీసులివ్వకుండా, తన వాదన వినకుండా, సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఇవ్వకుండా కమిషన్ నివేదిక ఇచ్చిందని, దానిని కొట్టేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. అందులో పలు కీలక అంశాలను వివరించింది. అవి.. పిటిషనర్ కేసీఆర్‌కు కమిషన్ పూర్తిస్థాయి సమయం ఇచ్చింది. కమిషన్ నోటీసులు జారీ చేయడమంటేనే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ సెక్షన్ 8–బీ కింద జారీ చేసినట్లు లెక్క. పిటిషనర్ తన వాదనలను పూర్తిస్థాయిలో కమిషన్ ఎదుట వివరించి.. తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో నోటీసు ఇవ్వలేదని చెప్పడం సమంజసం కాదు. యాక్ట్ ప్రకారం సెక్షన్ 8–బీ, సెక్షన్ 8–సీ నోటీసుకు ప్రత్యేకమైన ఫార్మాట్ అంటూ ఏదీ లేదు. నోటీసులో సెక్షన్‌ను ప్రస్తావించనంత మాత్రాన తప్పు జరిగిపోయినట్లు కాదు. ఈ వాదన న్యాయసమీక్షకు నిలబడదు. కమిషన్ చేపట్టిన ఎగ్జామినేషన్‌కు పిటిషనర్ ఎలాంటి అభ్యంతరం తెలపలేదనే విషయాన్ని గుర్తించాలి. బ్యారేజీల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని చెప్పిన కేసీఆర్.. దానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లనూ సమర్పించలేదు. సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశమిచ్చినా ఉపయోగించుకోలేదు. కమిషన్ సహజ న్యాయసూత్రాలను పక్కాగా పాటించింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక కాపీని తనకు అందజేయకుండా మీడియాకు విడుదల చేసిందనే వాదన తప్పు. నివేదికను ప్రభుత్వం మీడియాకు ఇవ్వలేదు. దానిపై నిర్ణయం తీసుకోవడంలో భాగంగా మంత్రివర్గానికి సులభంగా అర్థం కావడానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అధికారులు సిద్ధం చేశారు. దానివల్ల పిటిషనర్ హక్కులకు ఎలాంటి భంగం కలగలేదు. పిటిషనర్ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. మీడియాలో వచ్చే కథనాలపై ఆధారపడకూడదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిన విషయాన్ని పిటిషనర్ గుర్తించాలి.

అన్ని ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, సాక్షులను విచారించిన తర్వాత కమిషన్ పిటిషనర్ పాత్రపై నివేదికను సమర్పించింది. పిటిషనర్ కేసీఆర్ నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టినట్లు, నీటిని నిల్వ చేయడంపై నిర్ణయాలు తీసుకున్నట్లు, ఆ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కమిషన్ తేల్చింది. ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తోందనే ఆరోపణల్లో వాస్తవం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఇచ్చిన నివేదికలో ప్రభుత్వ జోక్యం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండదు. ప్రస్తుత కేసులో పరిపాలనాపరమైన లోపాలను, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలను కమిషన్ గుర్తించింది. ఏయే తప్పులకు ఎవరు బాధ్యులు అని చెప్పడం కచ్చితంగా కమిషన్ విధుల్లోకే వస్తుంది. ఇది చట్టప్రకారమే జరిగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదికను కొట్టేయాలని కేసీఆర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లకు కాలం చెల్లింది.

**కేసీఆర్ నిర్ణయాలతో రాష్ట్రానికి నేరపూరిత నష్టం**

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తీసుకున్న సొంత నిర్ణయాలతో రాష్ట్రానికి నేరపూరిత నష్టం జరిగిందని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొంది. బ్యారేజీల నిర్మాణ ప్రదేశం ఎంపిక, ప్లానింగ్‌లో లోపాలను ఇందులో ఎత్తిచూపింది. పైగా, గంపగుత్త విధానంలో పనులు కట్టబెట్టారని, నిర్ణీత కాలంలో నిర్మాణం చేపట్టనందుకు ఎలాంటి జరిమానాలు విధించకుండా గడువులు పెంచిందని తెలిపింది. బ్యారేజీల నిర్మాణం పూర్తికాకుండానే పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేశారని, నిర్ణీత వ్యవధికి ముందే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారని ఆక్షేపించింది. నిర్మాణ ప్రదేశాల్లో తగిన పరీక్షలు చేయకుండానే డిజైన్లు సిద్ధం చేశారని, డిజైన్లకు విరుద్ధంగా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేశారని పేర్కొంది. బ్యారేజీలు ప్రధానంగా మేడిగడ్డ తీవ్రంగా దెబ్బతిన్నదని గుర్తు చేసింది. ఈ వైఫల్యానికి ప్రధాన కారకుడు కేసీఆర్ మాత్రమేనని, ఆఖిల భారత సర్వీసు అధికారులతో పాటు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు బాధ్యులుగా కమిషన్ తేల్చిందని వివరించింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ స్వచ్ఛందంగా విచారణకు హాజరయ్యారని, ఇప్పుడు నివేదిక పక్షపాతంతో ఉందనడం సరికాదని పేర్కొంది.

# త్వరలో బరాజ్‌ల పునరుద్ధరణకు కసరత్తు

-మొదటిపేజీ తరువాయి



పునరుద్ధరణకు ప్రణాళిక, డిజైన్లు, అంచనాలను సిద్ధం చేస్తాయన్నారు. పునరుద్ధరణ వ్యయాన్ని బరాజ్‌ల నిర్మాణ సంస్థలే భరిస్తాయని స్పష్టం చేశారు. కన్సల్టెంట్లు ఇచ్చిన డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించిన తర్వాతే బరాజ్‌ల పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామన్నారు. సాంకేతిక పటిష్టత, జవాబుదారీతనం, ప్రజాధనంతో కట్టిన ఆస్తులను వినియోగంలోకి తీసుకురావడమే తమ కర్తవ్యమన్నారు. బరాజ్‌ల పునరుద్ధరణపై బుధ వారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ బరాజ్‌లను బాధ్యతాయుతంగా పునరుద్ధరించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు. బరాజ్‌లు దెబ్బతినడానికి రాజకీయ, సాంకేతిక స్థాయిల్లో జరిగిన లోపాలే కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్ఏ), జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, విజిలెన్స్ విభాగం తమ విచారణలో తేల్చడంతో వాటిని సరిదిద్దే చర్యలు చేపట్టామన్నారు. అత్యున్నత సాంకేతిక అర్హతలు కలిగిన స్వతంత్ర సంస్థలు, కన్సల్టెంట్ల సహకారంతో వాటి పునరుద్ధరణ పనులకు డిజైన్లను తయారు చేయిస్తున్నామన్నారు.

పునరుద్ధరణ చర్యలకు మార్గదర్శకత్వం కోసం కేంద్ర జలసంఘాన్ని (సీడబ్ల్యూసీ) సంప్రదిస్తే.. అర్హతలు, అనుభవం కలిగిన సాంకేతిక నిపుణులు డిజైన్లను రూపొందిస్తే వాటిని పరిశీలించి ఆమోదించడంతో పాటు పనుల నిర్వహణలో సహకరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఐఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థలతో ఒప్పందం చేసుకుని ఉండడంతో పాటు డ్యామ్‌ల భద్రతలో అనుభవం కలిగి ఉన్న కంపెనీలకే పనుల్లో ప్రాధాన్యమిస్తామన్నారు. వాటి ఆర్థిక సామర్థ్యాన్ని పరిశీలించి మూడు కంపెనీలను షార్ట్‌లిస్టు చేస్తామన్నారు.

**సత్వరంగా సమ్మక్క.. అనుమతులు తేవాలి**

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి సత్వరంగా నిరభ్యంతర పత్రాన్ని రాబట్టుకుని ప్రాజెక్టుకు టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) అనుమతులు పొందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. మోడికుంటవాగు, చనాకా%–%కొరాటా, చిన్నకాళేశ్వరం, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సత్వరంగా ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌లను సాధించాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టులోని ప్యాకేజీ%–%6 పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ(జనరల్) అంజాద్ హుసేన్, డిప్యూటీ ఈఎన్సీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై మళ్లీ కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

సంఘం (ఎస్ఎఫ్‌సీ)పరంగానూ నిధుల విడుదల చేయలేకపోవడంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో నిధుల లేమి సమస్య చాలా తీవ్రంగా మారింది. సకాలంలో స్థానిక ఎన్నికలు జరగక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన దాదాపు రూ.3 వేల కోట్లు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నిధుల సాధన కోసం ఎన్నికలు జరపాలనే ఒత్తిడి రాష్ట్ర ప్రభుత్వంపై పెరుగుతోంది. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సినంత చేసినందున, రిజర్వేషన్ల పెంపుదల అంశం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం అనేది రాష్ట్ర పరిధిలో లేనందున ఎన్నికలకు వెళితేనే మంచిదనే అభిప్రాయం వ్యక్తమౌతున్నట్టు తెలుస్తోంది.

**17న ఈ అంశంపైనే ప్రధానంగా చర్చ!**

ఈ నెల 14న బిహార్ అసెంబ్లీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున, 17న నిర్వహించే కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై ప్రధానంగా చర్చించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్టుగా సమాచారం. కాగా ఎన్నికలకు సంబంధించి పూర్తిస్థాయిలో నోట్‌ఫైల్‌తయారు చేయాలని పీఆర్ ఉన్నతాధికారులను సీఎస్‌ఆదేశించినట్టు తెలిసింది. ఇలావుండగా.. ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే హైకోర్టుకు తెలియజేసింది. స్థానిక సంస్థల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీల రిజర్వేషన్ల శాతం ఖరారుతో పాటు, ఈ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందిన వెంటనే తాము కార్యరంగంలో దిగుతామని స్పష్టం చేసింది. శాంతిభద్రతల పరిస్థితిపై.. సీఎస్, పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కూడా ఎస్ఈసీ సమావేశాలు నిర్వహించి అంతా సిద్ధం చేసిన విషయం తెలిసిందే. మొత్తం అయిదు విడతల్లో జిల్లా, మండల పరిషత్ (రెండు విడతల్లో), గ్రామపంచాయతీ (మూడు విడతల్లో) ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలతో పాటు, మొదటిదశ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఎస్ఈసీ నోటిఫికేషన్ కూడా జారీ చేసిన సంగతి విదితమే. అయితే రిజర్వేషన్ల జీవో, ఎస్ఈసీ షెడ్యూల్, నోటిఫికేషన్‌లను హైకోర్టు నిలుపుదల చేయడంతో ఈ ఎన్నికలు ఆగిన సంగతి తెలిసిందే.

## 'హద్దు'లు దాటి ఇసుక దందా!

మహబూబ్‌నగర్/ఖమ్మం/సత్తుపల్లి

ధనార్జనే ధ్యేయంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి వేళ ఆంధ్రప్రదేశ్ నుంచి భారీ వాహనాల్లో ఇసుకను రవాణా చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఏపీ సరిహద్దులు దాటి మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల మీదుగా లారీలు తెలంగాణలో ప్రవేశిస్తున్నాయి. ఏపీలోని తాడిపత్రిలో ఉన్న ఓ అధికారిక రీచ్ నుంచి కర్నూలు మీదుగా వాహనాలు వస్తున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా గుండా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని గద్వాల, రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్, ఆదిభట్ల తదితర ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌లోని పలు చోట్లకు ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం 70 నుంచి 90 వరకు బెంజ్ వాహనాల్లో ఈ అక్రమ రవాణా కొనసాగుతోంది. కర్నూలు జిల్లాలో ఏపీ కూటమి ప్రభుత్వంలోని కీలక పార్టీకి చెందిన వ్యక్తి ఈ దందా కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఏపీలోని అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండతో బినామీలు రెచ్చిపోతున్నారు. గోదావరి ఇసుకను దర్జాగా ఏపీ సరిహద్దు దాటిస్తున్నారు. ఏలూరు జిల్లాకు చెందిన ఆ ఎమ్మెల్యే బినామీలకు చెందిన ఇసుక టిప్పర్లు ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో పట్టుబడడం గమనార్హం. కాగా ఏపీకి చెందిన నేతలు ఈ విధంగా ఇష్టారాజ్యంగా ఇసుక దందా చేస్తున్నా..పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తాడిపత్రి నుంచి యథేచ్ఛగా..**

అనంతపురం జిల్లా తాడిపత్రి రీచ్ వద్ద ఒక లారీ లేదా బెంజ్ లోడ్‌కు రూ.10 వేల నుంచి రూ.12 వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ధర తక్కువగా ఉండడంతో కన్నేసిన ఇసుక మాఫియా అక్కడి నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి టన్ను రూ.1,800 నుంచి రూ.2,400 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. అర్ధరాత్రి 12.30 నుంచి తెల్లవారుజాము 3 గంటల మధ్య ఇసుక లోడ్ వాహనాలు సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా దాటేలా అక్రమార్కులు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. ఈ సమయంలో గస్తీ నామమాత్రంగా ఉండడంతో ఇసుక వాహనాలు సులువుగా సరిహద్దులు దాటుతున్నాయి. ఎక్కువగా 16 టైర్ల లారీల్లోనే ఇసుకను తరలిస్తున్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం 16 టైర్ల వాహనంలో 47 టన్నులు, 14 టైర్ల వాహనంలో 42 టన్నులు, 12 టైర్ల వాహనంలో 36 టన్నులు, 10 టైర్ల వాహనంలో 28 టన్నుల ఇసుకను మాత్రమే తరలించాలి. కానీ ఆయా వాహనాలను రీడిజైన్ చేసి.. సామర్థ్యానికి మించి 35 నుంచి 45 శాతం మేర అధికంగా ఇసుకను తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఏపీ కూటమి పార్టీ వ్యక్తి, స్థానిక నేత కుమ్మక్కు**

ఇసుక దందా వెనుక ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీ కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న పార్టీకి చెందిన ఒక వ్యక్తి.. తెలంగాణ అలంపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కనుసన్నల్లో ఈ దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆ ఇద్దరి మధ్య ఎప్పటినుంచో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సమీప బంధువులని కూడా సమాచారం. నెల రోజులుగా ఏపీ నుంచి తెలంగాణకు ఇసుకను తరలిస్తున్న పది వాహనాలను స్థానిక పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఇసుక రవాణా కొనసాగుతుండగా.. ఇటు పోలీసులు, అటు రవాణా శాఖ చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే రాత్రివేళ దొంగ చాటుగా ఇసుక లారీలు తెలంగాణకు వస్తున్న నేపథ్యంలో టోల్‌ప్లాజా వద్ద గస్తీ పెంచామని జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు.

**ఏజెంట్ల ద్వారా వ్యవహారం**

ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో లోడ్ చేస్తున్న గోదావరి ఇసుకను ఆర్డర్ల ఆధారంగా టిప్పర్లు, లారీల్లో సత్తుపల్లి, ఖమ్మం, హైదరాబాద్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాహనాలు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు దాటి తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. ఇందులో ఏలూరు జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

## చలి ముట్టడిలో తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

(ఎన్‌పీసీసీహెచ్‌హెచ్) గత ఏడాది ప్రకటించింది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు.

**చలితీవ్రతతో వచ్చే ఆరోగ్య సమస్యలెన్నో**

తీవ్రమైన చలి కారణంగా ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హైపోథెర్మియా (శరీర ఉష్ణోగ్రత పడిపోవడం), చర్మం లోపలి కణజాలం గడ్డకట్టి గాయాలవడం (ఫ్రాస్ట్‌బైట్) వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. చల్లని వాతావరణం కారణంగా రోగ నిరోధక శక్తి మందగిస్తుంది. వైరస్‌లు సులభంగా వ్యాప్తి చెందుతాయి. న్యూమోనియా, ఇతర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. ఆస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధుల లక్షణాలు తీవ్రతరం అవుతాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తుమ్ములు, తలనొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. ఇక చర్మ సమస్యల ( డ్రైస్కిన్, చర్మం పగిలిపోవడం, దురద) తీవ్రత పెరుగుతుంది. తీవ్రమైన చలికి లోనైతే రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల రక్తపోటు, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**వీరికి మరింత అప్రమత్తత అవసరం**

చలి తీవ్రత నేపథ్యంలో ముఖ్యంగా చిన్నారులు, పెద్ద వయసువారికి సమస్యలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు, చలిలో ఆరుబయట పనిచ్చేస కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలని, గోరు వెచ్చని నీళ్లు తాగాలని చెబుతున్నారు. చేతులకు గౌజులు, పాదాలకు సాక్స్ వేసుకోవాలని, వైరస్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలున్న వారు ఇన్ హేలర్లను దగ్గర ఉంచుకోవాలని, బయటికి వెళితే మాస్క్ ధరించాలని స్పష్టం చేస్తున్నారు. చిన్నారులు, పెద్ద వయసువారు చలి సమయాల్లో బయటికి వెళ్లకపోవడం మంచిదని పేర్కొంటున్నారు.

**మరింత పెరగనున్న చలి**

రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10–12.5 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. మంగళవారం రాత్రి అత్యల్పంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 10.2 డిగ్రీలు, లింగాపూర్‌లో 10.5, ఆదిలాబాద్ జిల్లా సాత్నాలలో 11.1, బోథ్ మండలం పొచ్చెరలో 11.2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**చిన్నారులకు చలితో ప్రమాదం**

ఉష్ణోగ్రతలు బాగా తగ్గితే నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం. ముఖ్యంగా నవజాత శిశువులకు హైపోథెర్మియా కారణంగా ప్రాణహాని తలెత్తవచ్చు. వారిని వెచ్చగా ఉంచాలి. చల్లటి వాతావరణంతో పిల్లల్లో ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. ఆస్తమా ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకు తగిన ఇన్‌హేలర్లు వాడాలి. డిసెంబరు నెలలో చికెన్ పాక్స్, మిజిల్స్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి పెరుగుతుంది. ముందు జాగ్రత్తగా పిల్లలకు టీకాలు ఇప్పించాలి.

## వచ్చే ఎన్నికల్లోనూ మేమే గెలుస్తాం

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. వారిలో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. వచ్చేసారి గెలిచేది కూడా మేమే. 100 స్థానాల్లో విజయం సాధిస్తాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మేం మంచి మెజార్టీతో గెలవబోతున్నాం. అక్కడ ఓడిపోతున్నట్టు తెలిసే బీఆర్ఎస్ మాపై నిందలు వేస్తోంది. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పక్షాన కేసీఆర్ కుటుంబమంతా ప్రచారం చేసింది. కవిత ఒక్కరే మిస్సింగ్. ప్రచారానికి కేసీఆర్ ఎందుకు రాలేదో కేటీఆర్‌ను అడిగితే తెలుస్తుంది. ఆయన ప్రచారానికి రాకపోయినా ప్రముఖులు, ముఖ్యులతో ఫోన్లో మాట్లాడారనే సమాచారం మాకుంది. అయితే కేసీఆర్, బీఆర్ఎస్‌లను ప్రజలు మర్చిపోతున్నారు. నేను గతంలో చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ ఉండదు. ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నా బిహార్‌లో మహాగఠ్ బంధన్ విజయం స్యాధిస్తుంది..'అని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు.

**త్వరలో 'స్థానిక'భేటీ**

'ఇక స్థానిక సంస్థలకు ఎన్నికలపై దృష్టి సారిస్తాం. హైకోర్టు నిర్ణయం వచ్చిన తర్వాత ఏఐసీసీ పెద్దలతో మరోమారు మాట్లాడతాం. భవిష్యత్ కార్యాచరణపై రెండు, మూడు రోజుల్లో సీఎంతో పాటు సీనియర్ నేతలతో సమావేశమవుతాం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకంపై హైకమాండ్ ఎప్పుడైనా ప్రకటన చేయవచ్చు. నాకు మంత్రి అవ్వాలని, లేదా ఉప ముఖ్యమంత్రి అవ్వాలనే ఆలోచన లేదు. పార్టీపై మక్కువ ఉన్న వ్యక్తిని. మంత్రి హోదా కంటే పీసీసీ అధ్యక్ష స్థానానికే ప్రాధాన్యతనిస్తా. ఏదైనా అధిష్టానం నిర్ణయం శిరోధార్యం..'అని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

